## జాతీయ స్థాయి 'కళోత్సవ్'కు ముత్యంపల్లి విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కాసిపేట, జనవరి 6 : ముత్యంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కళోత్సవ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వెంకటేశ్వరస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు బిందుప్రియ, నరేందర్ ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి కళోత్సవ్ పోటీల్లో బిందుప్రియ తోలు బొమ్మల ఆటలతో పాటు బాలికల విద్య, జాతీయ సమైక్యత, ఓటు హక్కు, కరోనా జాగ్రత్తలపై ప్రదర్శన ఇవ్వనుండగా, నరేందర్ చిన్నయ్య సూరి పంచతంత్ర కథలోని పలు అంశాలపై చెక్క పొట్టు ఆధారంగా తయారు చేసిన బొమ్మలతో ప్రదర్శన ఇస్తాడన్నారు. గైడ్ టీచర్ శాంకరిని, డీఈవో యాదయ్య, ఎంఈవో ప్రభాకర్, హెచ్ఎం వెంకటేశ్వరస్వామి వారిని అభినందించారు. ఉపాధ్యాయులు పుష్పలత, పల్లె కృష్ణగోపాల్‌రావు, జ్యోతి, మాధవీలత పాల్గొన్నారు.

## కల్తీ పెట్రోల్ విక్రయించిన బంక్ సీజ్


పెట్రోల్ బంక్‌లో కల్తీ పెట్రోల్‌ను చూపిస్తున్న వాహనదారుడు

జన్నారం, జనవరి 7 : కల్తీ పెట్రోల్ విక్రయించిన ఓ బంక్‌ను అధికారులు సీజ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఓ బంక్‌లో పలువురు తమ వాహనాల్లో పెట్రోల్ పోయించుకున్నారు. కొద్దిసేపటికే అవి నడువకుండా ఆగిపోయాయి. దీంతో అనుమానం వచ్చి వాహనాల్లో పోయించుకున్న పెట్రోల్‌ను తీసి చూశారు. కల్తీ జరిగినట్లు గుర్తించారు. బంక్ యజమానిపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న ఆర్ఐ గంగారాజు అక్కడికి చేరుకొని పంచనామా చేసి బంక్‌ను సీజ్ చేశారు.

*కేంద్రం ప్రవేశపెట్టిన 'జన్‌మన్' ఆదిమ గిరిజనులకు వరంగా మారనున్నది. ఈ పథకం ద్వారా ఆదివాసీ తెగలకు చెందిన కొలాం, మన్నేవార్, తోటి గ్రామాలను ప్రగతి బాట పట్టించనుండగా, ఆ మేరకు యంత్రాంగం సర్వే చేస్తున్నది. వసతులు, ఆర్థిక, ఆరోగ్య స్థితిగతులపై నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధమవుతున్నది. ఈ నెల 15వ తేదీ నుంచి పథకం అమలు చేయనుండగా, మరికొద్ది రోజుల్లోనే సకల సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి పల్లెల రూపురేఖలు మారనున్నాయి.*

# ఆదిమ గిరిజనులకు వరం 'పీఎం జన్‌మన్'

**కొలాం, తోటి, మన్నేవార్ గ్రామాల ప్రగతిపై కేంద్రం దృష్టి**

- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న సర్వే
- స్థితిగతులపై నివేదికలు రూపొందిస్తున్న అధికారులు
- ఈ నెల 15వ తేదీ నుంచి పథకం అమలు
- మారనున్న పల్లెల రూపురేఖలు


కొలాంలు నివాసముంటున్న కల్లెగాం గ్రామం


కొలాం గ్రామంలో సర్వే చేస్తున్న అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, (నమస్తే తెలంగాణ)/ కెరమెరి జనవరి 6 : కేంద్ర ప్రభుత్వం కొలాం, తోటి, మన్నేవార్‌ల జీవన ప్రమాణాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు జన్‌మన్ పథకాన్ని రూపొందించింది. ఈ పథకం ద్వారా ఆయా తెగలకు చెందిన గ్రామాల్లో పక్కా గృహాలు నిర్మించడం, ఇంటింటికీ తాగు నీరు, కరెంట్ సౌకర్యం కల్పించడం, రోడ్లు వేయడం, ప్రతి గ్రామాన్ని నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయడం, సంచార వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం, మినీ అంగన్‌వాడీలు, వికాస కేంద్రాలు ఏర్పాటు చేయడం, ప్రాథమిక విద్యనందించడం, వృత్తి పరమైన పనులు అందుబాటులోకి రావడం వంటివి చేస్తారు. ఇక కరెంటు సౌకర్యం కల్పించేందుకు వీలు కాని గ్రామాల్లో సోలార్ సిస్టంను అందుబాటులోకి తీసుకువస్తారు. 0.3 కేవీ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేస్తారు. మల్టీపర్పస్ కేంద్రాలను నిర్మిస్తారు.

### సర్వే చేస్తూ.. నివేదికలు

పీటీజీ (ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్స్) ఆదిమ గిరిజన తెగలకు చెందిన గ్రామాల్లో అధికారులు సర్వేలు చేపడుతున్నారు. జిల్లాలో ఆసిఫాబాద్, జైనూర్, కెరమెరి, రెబ్బెన, సిర్పూర్-యు, తిర్యాణి, వాంకిడి, సిర్పూర్-టీ, కాగజ్‌నగర్ మండలాల్లో 149 ఆదివాసీ గిరిజన గ్రామాలున్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాల్లో 16 వేలకు పైగా జనాభా ఉంది. ఇందులో 185 కొలాం, తోటి, మన్నేవార్ గ్రామాలున్నట్లు తెలుస్తోంది. ఈ గ్రామాల్లో అధికారులు సర్వే చేస్తున్నారు. అందరూ ఆధార్ కార్డులు కలిగి ఉన్నారా.. గ్రామాల్లో కావాల్సినటువంటి సౌకర్యాలేమిటి.. ఆరోగ్య పరిస్థితులు ఎలా ఉన్నాయి.. అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ నివేదికలు తయారు చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రధాన మంత్రి జన్‌మన్ పథకాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా, అడవిబిడ్డలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పీఎం జన్‌మన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**డీటీడీవో ఆత్రం గంగారాం**


కొత్తపేటలో అంత్యోదయ కార్డును అందజేస్తున్న తహశీల్దార్ వేణుగోపాల్

జన్నారం, జనవరి 6 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జన్‌మన్ పథకాన్ని ఆదివాసీలంతా సద్వినియోగం చేసుకోవాలని డీటీడీవో ఆత్రం గంగారాం పేర్కొన్నారు. ప్రధాన్‌మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకంలో భాగంగా శనివారం కొత్తపేటలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. కొత్తగూడ, బక్కగూడ,రాయికుంట,జన్నారంలోని వరద బాధితుల కాలనీ, పొనకల్‌లోని పుట్టిగూడ, తపాలాపూర్‌లోని కొలాంగూడెంలో రోడ్డు, ఇండ్ల నిర్మాణం, కరెంట్ సౌకర్యం, తాగునీటి వసతి కల్పించడం, రక్తహీనతతో బాధపడుతున్న వారికి వైద్యం అందించడం, కేసీఆర్ కిట్ల పంపిణీ చేయడం, ఆధార్, అంత్యోదయ, పీఎం కిసాన్ కార్డులు అందించడం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో అరుణారాణి, సర్పంచ్ లావణ్య, కార్యదర్శి బాపురావు,తోటి, కొలాం గిరిజనులు పాల్గొన్నారు.


ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి (ఫైల్)

# ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం అర్జీలు**

**9,48,666**

- డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు కొనసాగిన గ్రామసభలు
- దరఖాస్తులు స్వీకరించిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఆధార్ కోసం అవస్థలు పడ్డ ప్రజలు

ఆదిలాబాద్, జనవరి 6(నమస్తే తెలంగాణ) : అభయహస్తం పథకంలో భాగంగా ఐదు గ్యారెంటీల కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. డిసెంబర్ 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన పేరిట గ్రామసభలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలు, గ్రామాల్లో బృందాలను ఏర్పాటు చేసి ఎనిమిది రోజుల పాటు అర్జీలు తీసుకున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవోల పర్యవేక్షణలో గ్రామసభలు కొనసాగాయి. కాగా.. జైనథ్ మండలంలోని జామ్నిలో ప్రజాపాలనను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభించగా.. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని స్వీకరించారు. అధికారులు మాత్రం దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఆదేశించారు.

### ఆధార్ కోసం ఇబ్బందులు

ప్రజాపాలన దరఖాస్తులకు రేషన్, ఆధార్ కార్డులు తప్పనిసరిగా జతపర్చాలని ప్రభుత్వం సూచించింది. ఆధార్‌కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కుటుంబసభ్యుల చేరికలు, చిరునామా మార్పు, ఫోన్ నంబరు పొందపర్చడం కోసం ఆధార్ కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాశారు. ఆధార్ అప్‌డేట్ విషయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతో కేంద్రాలు జనంతో రద్దీగా కనిపించాయి. దరఖాస్తుల స్వీకరణను జిల్లా అధికారులు పకడ్బందీగా పర్యవేక్షించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా నెలకు రూ. 2,500ల ఆర్థిక సాయం, రూ.500 సిలిండర్, రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరానికి రూ.15వేలు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు ఏడాదికి రూ.12 వేలు, ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గృహజ్యోతి పథకంలో భాగంగా నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, చేయూత పథకానికి దరఖాస్తులు అందజేశారు. ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి ప్రశాంతి, కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్లు, అధికారులు గ్రామసభలను పరిశీలించారు.

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు**

| జిల్లా | అర్జీలు |
|---|---|
| ఆదిలాబాద్ | 2,24,136 |
| నిర్మల్ | 2,80,489 |
| ఆసిఫాబాద్ | 1,60,779 |
| మంచిర్యాల | 2,83,262 |


మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

## ఆన్‌లైన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్**

మంచిర్యాలటౌన్, జనవరి 6 : ప్రజాపాలన దరఖాస్తు ఫారాల ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. కావాల్సినన్ని కంప్యూటర్లను ఏర్పాటు చేసి నిర్ణీత గడువులోగా దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ నెల 17వ తేదీ కంటే ముందే ఈ ప్రక్రియ పూర్తిచేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఏ మారుతీప్రసాద్, మేనేజర్ విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ సహదేవరావు

## ఆధార్ కార్డు ఉంటేనే సంక్షేమ పథకాలు

**కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**

ఆసిపాబాద్/ఆసిఫాబాద్ టౌన్, జనవరి 6 : పీటీజీ తెగలకు చెందిన వారంతా తప్పనిసరిగా ఆధార్ కార్డు కలిగి ఉండాలని, అప్పుడే సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించడం జరుగుతుందని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆర్డీవో సురేష్‌తో కలిసి పీటీజీ తెగలకు చెందిన సంఘాల నాయకులు, పటేళ్లతో పీఎం జన్‌మన్ పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీటీజీ తెగలకు చెందిన ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన జన్‌మన్ పథకం లబ్ధి పొందాలంటే జిల్లాలోని పీటీజీ కులాల వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా జన్‌మన్ బ్యాంకు ఖాతా, కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని సూచించారు. ప్రధానమంత్రి కిసాన్ క్రెడిట్ కార్డ్, ఆయుష్మాన్ భారత్ పథకం కింద హెల్త్ కార్డులు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు, గ్రామ పటేళ్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గూడెం ఎత్తిపోతలతో సస్యశ్యామలం

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు
- కలెక్టర్ సంతోష్‌తో కలిసి నీటి విడుదల


డెలివరి పాయింట్ వద్ద పూజలు చేస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

దండేపల్లి, జనవరి6 : గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకంతో కడెం ఆయకట్టు చివరి భూములన్నీ సస్యశ్యామలంగా మారుతున్నాయని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం తానిమడుగు సమీపంలో డెలివరీ పాయింట్ వద్ద మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి పూజలు చేసి నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎత్తిపోతల పథకంతో రైతులకు సాగునీటి కష్టాలు తీరిపోయాయన్నారు. డీ-30 నుంచి 42 కాలువ వరకు ఎత్తిపోతల పథకం నీటిని అందిస్తామని తెలిపారు. రైతులు సాధ్యమైనంత వరకూ ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగారాణి-త్రిమూర్తి, డీఈఈలు దశరథ్, వెంకటేశ్వర్, జేఈలు జాకీర్, శ్రీధర్,సంజీవ్, రాజేందర్, సర్పంచ్ ప్రేమళ, రైతులు పాల్గొన్నారు.



## ఎండిన చెట్టుపై కిల కిలల సందడి

ఎండిపోయిన చెట్టుపై వాలిన పిట్టలు

స్థానిక జడ్పీ బాలికల పాఠశాల ఆవరణలోని మోడు వారిన చెట్టుకు పిట్టలు సరికొత్త రూపును తీసుకొచ్చాయి. శనివారం సాయంత్రం ఇలా ప్రతి కొమ్మపై వాలి కిలకిల రావాలతో సందడి చేస్తూ.. కనువిందు చేశాయి. అటు వైపు వెళ్లిన వారంతా పక్షులను ఆసక్తిగా తిలకించారు.

*- కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ)*

## రైళ్ల రాకపోకలకు బ్రేక్

- ఖాజీపేట-బల్హార్ష మూడో రైల్వేలైన్ పనులతో పలు రైళ్లు రద్దు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- వెలవెలబోతున్న బెల్లంపల్లి స్టేషన్

బెల్లంపల్లి, జనవరి 6 : ఖాజీపేట నుంచి బల్హార్ష వరకు మూడో రైల్వేలైన్ ట్రాక్ పనుల్లో భాగంగా పలు రైళ్లను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సికింద్రాబాద్-కాగజ్‌నగర్, ఖాజీపేట్-కాగజ్‌నగర్, కొత్తగూడెం-బల్హార్ష నడుమ నడిచే రైళ్లను రద్దు చేశారు. కేవలం ఇంటర్‌సిటీ రైలు మాత్రమే నడుస్తోంది. జమ్మికుంటలోని బిజిగిరి షరీఫ్ రైల్వే ట్రాక్ వద్ద మూడో రైల్వే లైన్ పనులు చేపడుతుండగా, కొన్ని రోజులుగా రామగిరి, సింగరేణి, పుష్‌పుల్ రైళ్లను రద్దు చేశారు. తాజాగా.. ఈ నెల 3 నుంచి కాగజ్‌నగర్, భాగ్యనగర్ రైళ్లను సైతం రద్దు చేయడంతో రాకపోకలకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. అనేక మంది బెల్లంపల్లి నుంచి కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, భాగ్యనగర్ రైళ్లలోనే ప్రయాణిస్తుంటారు. ఇక వ్యాపారులతో పాటు పలువురు ఉద్యోగులు సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రెండు రైళ్లను మాత్రం ఈ నెల 13వ తేదీ తర్వాత పున:రుద్ధరించనున్నట్లు బెల్లంపల్లి రైల్వే అధికారులు తెలిపారు. పండుగ ముందు రైళ్లు నడవకపోవడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే బెల్లంపల్లి రైల్వేస్టేషన్ నిర్మానుష్యంగా మారింది. ఒకటి, రెండవ ప్లాటుఫాంలు వెలవెలబోతున్నాయి. టికెట్ కౌంటర్ ఖాళీగా దర్శనమిస్తోంది. ఆటోలకు గిరాకీ లేకుండా పోయింది. రైళ్ల రద్దుతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి పోతున్నాయి.


ప్రయాణికులు లేక వెలవెలబోతున్న బెల్లంపల్లి రైల్వేస్టేషన్

## మా హయాంలోనే మహర్దశ

- రూ.31 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశాం
- 30 వేల ఎకరాలను సస్యశ్యామలంగా మార్చాం
- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

దండేపల్లి, జనవరి 6 : కేసీఆర్ సర్కారు హయాంలోనే గూడెం ఎత్తిపోతలకు మహర్దశ వచ్చిందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శనివారం 'నమస్తే తెలంగాణ'తో ఆయన మాట్లాడుతూ పదేళ్లక్రితం కేసీఆర్ ఎల్లంపెల్లి ప్రాజెక్టు, గూడెం ఎత్తిపోతలను ప్రారంభించి 30 వేల ఎకరాలను సస్యశ్యామలంగా మార్చారన్నారు. 2021 జూలై, ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు గూడెం ఎత్తిపోతల పథకం పూర్తిగా నీట మునిగి.. మోటర్లు, ఇతర సామగ్రి, నీటిని ఎత్తిపోసే రెండు టర్బైన్ మెటర్లు, జనరేటర్, బేరింగ్‌లు, విద్యుత్ ప్యానెళ్లు దెబ్బతిన్నాయన్నారు. 4.2 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన రెండు పంపులు పూర్తిగా మునిగి పోవడంతో భారీగా నష్టం వాటిల్లిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వేగంగా స్పందించి రూ.10.48 కోట్లతో పనులు పూర్తి చేసిందని గుర్తు చేశారు. అలాగే ఎత్తిపోతల పథకంలో తరుచూ తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గతేడాది కేసీఆర్ చొరవతో ఇంతకుముందు ఉన్న జీఆర్(గ్లాస్ రీఎన్‌ఫోర్స్‌డ్) పైపులు తొలగించి.. రూ.20 కోట్లతో మైల్డ్ స్టీలు(ఎంఎస్)పైపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులకు సాగు నీరు అందించేందుకు ఇబ్బంది కాకుండా వేసవిలో 2 కిలో మీటర్ల పైపులైన్ పనులు ప్రారంభించి పూర్తిచేశామని, ఇది కేవలం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే జరిగినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. గూడెం ఎత్తిపోతల పథకం రెండో పంటకు నీటి విడుదల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వాన్ని, కేసీఆర్‌ను రైతులంతా తలుచుకుంటున్నారని అన్నారు. నిన్నగాక మొన్న అధికారంలోకి వచ్చిన వారు ఈ పనులన్నీ తాము చేశామని చెప్పుకోవడం విడ్డూరమన్నారు.

## ఎమ్మెల్యేను అడ్డుకున్న ఆదివాసులు


ఎమ్మెల్యేను అడ్డుకుంటున్న ఆదివాసులు

కాసిపేట, జనవరి 6 : దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్న రాములు నాయక్‌కు మద్దతుగా గేట్‌మీటింగ్‌కు వెళ్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను శుక్రవారం సాయంత్రం ఆదివాసులు అడ్డుకున్నారు. ఓరియంట్ కంపెనీ ముందుకు చేరుకోగానే తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆయనను అడ్డుకున్నారు. ఆదివాసులకు కాకుండా మరో గిరిజన వర్గానికి చెందిన రాములు నాయక్‌కు మద్దతు ఇవ్వద్దని, విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మంత్రులతో చర్చించి నిర్ణయం చెబుతానని ఎమ్మెల్యే ఆదివాసులకు వివరించగా, వారు శాంతించారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు మడావి వెంకటేశ్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్, మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య పాల్గొన్నారు.